# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 31-03-2026 సమయం : సాయంకాలం 6గం.10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రజారోగ్యం దృష్ట్యా సంజీవని ప్రాజెక్టును జులై నాటికి రాష్ట్రమంతా అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- ❖ క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీతో అమరావతి భవిష్యత్ నగరంగా రూపుదిద్దుకుంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.
- ❖ అమరావతికి రాజధానిగా చట్టబద్ధత కల్పించే బిల్లు రేపు పార్లమెంట్ ఉభయ సభల ముందుకు రానుంది.
- ❖ రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ కొరత లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.

===============

వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో “అమరావతి క్వాంటం వ్యాలీ- క్వాంటం హార్డ్ వేర్ ప్రొడక్షన్ ఎకోసిస్టమ్” అనే అంశంపై ఈరోజు రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నేషనల్ క్వాంటం మిషన్ డైరెక్టర్ జేబీవీ రెడ్డి, అమరావతి క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సీడాక్, సీడాట్ తదితరులు ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరయ్యారు. క్వాంటం కంప్యూటర్ పరికరాల తయారీ కంపెనీల ప్రతినిధులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... భవిష్యత్ అంతా ఇక క్వాంటం కంప్యూటింగ్ దేనని, జాతీయ క్వాంటం మిషన్ లక్ష్యాలను ముందుగా అందిపుచ్చుకుని రాష్ట్రంలో అమరావతి క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేశామని చెప్పారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ సహకారంతో తొలి క్వాంటం కంప్యూటర్ ను అమరావతిలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. క్వాంటం కంప్యూటర్ హార్డ్ వేర్ ను దిగుమతి చేసుకోకుండా ఇక్కడే తయారు చేసుకోవాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నామని.. దీనికి అవసరమైన క్వాంటం పరికరాలు, టెక్నాలజీ, క్రయోజెనిక్స్, అల్గారిథమ్స్ మనమే తయారు చేసుకుందామని పిలుపునిచ్చారు. రాజధాని అమరావతిలో 8 టవర్లను నిర్మించి క్వాంటం టెక్నాలజీని ప్రోత్సహిస్తామని, క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీతో అమరావతి ఇక భవిష్యత్ నగరంగా రూపు దిద్దుకుంటుందని పేర్కొన్నారు.

===============

మెరుగైన ప్రజా ఆరోగ్య సంరక్షణ కోసం నిర్దేశించిన సంజీవని ప్రాజెక్టును జులై నాటికి రాష్ట్రమంతా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సంజీవని ప్రాజెక్టుపై ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో ఈరోజు సమీక్ష నిర్వహించిన ఆయన.. ఇప్పటికే చిత్తూరు జిల్లా కుప్పంలో సమర్ధవంతంగా అమలవుతోన్న ఈ ప్రాజెక్టును రాష్ట్రమంతటా అమలయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలో 56 లక్షల 40 వేల మందికి వైద్య పరీక్షలు చేపట్టి ఫలితాలను 48 గంటల్లోగా వాట్సాప్ ద్వారా నేరుగా వారికి అందించాలన్నారు. ఈ ఏప్రిల్ నుంచి ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లు, వైద్యాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. ప్రతీ నెల 4వ శనివారం 'స్వర్ణాంధ్ర పాపులేషన్ మేనేజ్మెంట్' పేరిట గ్రామసభలు, వైద్యశిబిరాలు, అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.

===============

అమరావతికి రాజధానిగా చట్టబద్ధత కల్పించే బిల్లు రేపు పార్లమెంట్ ఉభయ సభల ముందుకు రానుంది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ లోక్ సభలో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన సవరణ చట్టం పేరుతో ఈ బిల్లును ప్రవేశపెట్టనుంది. ఈ మేరకు లోక్‌సభ బిజినెస్ జాబితాలో దీనిని చేర్చారని తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ నాయకుడు లావు శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు. న్యూ ఢిల్లీలో ఆయన ఈరోజు విలేకరులతో మాట్లాడుతూ... లోక్ సభలో ఆమోదం పొందిన తరువాత రాజ్యసభ ముందుకు వెళ్లనుందని చెప్పారు. గురువారం లోగా ఈ బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందే అవకాశం ఉందన్నారు. భవిష్యత్ లో ఎలాంటి ఇబ్బందులు రాకూడదనే అమరావతికి చట్టబద్ధత కల్పిస్తున్నామని ఆయన వివరిస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

===============

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు పర్యటించనున్నారు. ముందుగా నెల్లూరు జిల్లా వింజమూరులో జరిగే పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొంటారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక ఫించన్ల పంపిణీలో భాగంగా లబ్ధిదారులకు పింఛన్లు అందించనున్నారు. ఈ కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్ట శ్రీ కోదండరాముని ఆలయాన్ని చేరుకొని కళ్యాణ మహోత్సవం సందర్భంగా సీతారాముల వారికి సతీసమేతంగా పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పిస్తారు.

విరామం

===============

రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ కొరత లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నేపథ్యంలో.. దేశంలో గ్యాస్ కొరత ఏర్పడుతుందన్న ప్రచారాలను నమ్మవద్దని కోరారు. విజయవాడ కానూరులోని పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో మంత్రి ఈరోజు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. గ్యాస్ కొరత లేకుండా ఉండేందుకు కేంద్ర స్థాయిలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నాదెండ్ల మనోహర్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

===============

శ్రీకాకుళం జిల్లాలోని మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీ సీ జనార్ధన్ రెడ్డి వెల్లడించారు. వచ్చే డిసెంబర్ నాటికి పోర్టు నిర్మాణం పూర్తి చేసి

అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని తెలిపారు. రామాయపట్నం, మచిలీపట్నం పోర్టులతో పాటు.. మూలపేట పోర్టును కూడా పూర్తి చేసి రాష్ట్రానికి మౌలిక సదుపాయాల హబ్‌గా మారుస్తామని మంత్రి ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం 25 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయని చెప్పారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే మూలపేట పోర్టు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టిందని, గత 20 నెలల కాలంలోనే 44 శాతంపైగా పనులు పూర్తి చేసిందని చెప్పారు. నేడు మొత్తంగా 1,835 కోట్ల రూపాయలతో 70 శాతం పనులు పూర్తి అయ్యాయని మంత్రి బీ సీ జనార్ధన్ రెడ్డి స్పష్టం చేశారు.

===============

కర్ణాటకలోని తుంగభద్ర డ్యామ్ గేట్ల మరమ్మతులను రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ ఈరోజు పరిశీలించారు. డ్యామ్ సైట్ నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఫోన్ చేసి కొత్త గేట్లు అమర్చుతున్న పనులను వివరించారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి ఈ పనులు పూర్తవుతాయని ముఖ్యమంత్రికి చెప్పారు. అనంతరం మంత్రి పయ్యావుల కేశవ్ పాత్రికేయులతో మాట్లాడుతూ... గతంలో తుంగభద్ర డ్యామ్ గేట్ కొట్టుకుపోయినప్పుడు వచ్చి పరిశీలిస్తే.. గేట్లు మొత్తం తుప్పుపట్టడం గమనించామని చెప్పారు. అదే విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తే రైతుల ప్రయోజనాలు కాపాడటం కోసం మొత్తం కొత్త గేట్లను అమార్చాలని ఆయన ఆదేశించారని చెప్పారు. ఇప్పటికే 18 కొత్త గేట్లు అమర్చామని పయ్యావుల కేశవ్ తెలియజేశారు.

===============

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పంచాయతీరాజ్ పురస్కారాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 5 జాతీయ అవార్డులను దక్కించుకుంది. దీనిపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖా మంత్రి కె. పవన్ కళ్యాణ్ సామాజిక మాధ్యమం వేదికగా స్పందిస్తూ... వరుసగా రెండో ఏడాది దీనదయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా మహిళలకు స్నేహపూర్వక వాతావరణం గల పంచాయతీగా తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండల పరిధిలోని బొక్కసంపాలెం గ్రామం జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం గెలుచుకోవడం మరింత సంతృప్తినిచ్చిందన్నారు. సుపరిపాలనలో విశాఖపట్నం జిల్లాలోని శృంగవరం గ్రామ పంచాయతీ మొదటి స్థానంలో నిలిచిందని గ్రామ స్థాయిలో పేదరిక నిర్మూలన, మెరుగైన జీవనోపాధి అంశాల్లో వైఎస్ఆర్ కడప జిల్లా, చెమ్ముళ్లపల్లి గ్రామం జాతీయ స్థాయిలో రెండో స్థానం దక్కించుకుందని వెల్లడించారు.

===============

కోస్తాంధ్రపై ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో దక్షిణం, ఆగ్నేయ దిశగా గాలులు వీస్తున్నాయని.. వీటి ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్రలో రాబోయే రెండు రోజులు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంది.

===============
===============